క్లుప్తంగా

మైనార్టీలకు దుస్తులు పంపిణీ



రామాయంపేటలో మైనార్టీలకు దుస్తులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

రామాయంపేట (మెదక్): రంజాన్ పర్వదినం సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు మైనార్టీ వర్గానికి చెందిన వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ మేరకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆదేశాలతో తాము దుస్తులు పంపిణీ చేశామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

పరామర్శ

పాపన్నపేట(మెదక్): మండలంలోని కొత్తపల్లి సొసైటీ సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేశ్ భార్య సుజాత(61) ఆదివారం ఇంట్లో జారీపడగా, తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కొడుకులున్నారు. కాగా మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కొత్తపల్లికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కును అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని లింగోజిగూడ తండాలో నిర్మిస్తున్న సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా ఆదివారం రూ.51 వేల విరాళం అందజేశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం తండాలో చేపట్టడం సంతోషకర విషయమన్నారు. తనవంతు సహాయంగా నిర్వాహకులకు చెక్కును అందజేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రవినాయక్, తదితరులు ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): దాడికి పాల్పడిన నాలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామానికి చెందిన చింతల యాదగిరి తన స్థలంలో ఇంటి నిర్మాణానికి సంబంధించి మట్టిపోయిస్తున్న క్రమంలో గొడవ చోటుచేసుకుంది. యాదగిరితో పాటు అతని కొడుకులు దేవేందర్, సంజీవ్‌పై ఇదే గ్రామానికి చెందిన చింతల రాజు, రవి, పోచయ్య, యాదయ్యలు దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు నాలుగురిపై కేసు చేసినట్లు చెప్పారు.

తాడ్వాయిలో శబరిమాత వార్షికోత్సవానికి విరాళాలు



విరాళాలు అందజేస్తున్న భక్తులు

హవేళిఘణాపూర్(మెదక్): తాడ్వాయిలో వెలసిన శ్రీ శబరిమాత ఆలయ వార్షికోత్సవం నిర్వహించేందుకు జన్మస్థలం తొగిట గ్రామం తరఫున భక్తుల నుంచి విరాళాలు సేకరించి ఆలయ కమిటీకి అందజేసినట్లు కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శబరిమాత జన్మస్థలం తొగిటతో పాటు ఆయా ప్రాంతాల నుంచి రూ.4లక్షలకు పైగా విరాళాలు సేకరించి కామారెడ్డి జిల్లా తడ్వాయిలోని శబరిమాత కమిటీకి అందజేశామన్నారు. ఈ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

రామాలయ కమిటీ చైర్మన్‌గా కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి రామాలయం కమిటీ చైర్మన్‌గా తోట కమలాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా కమ్మరి స్వామి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుంట రాజు, సంయుక్త కార్యదర్శులుగా ధర్మారం మల్లయ్య, ధార మల్లయ్య, కోశాధికారిగా నేరండ్ల రాజు, కార్యవర్గ సభ్యుడిగా బోయిని శ్రీనివాస్ పసులకాడి తిరుపతి, ఏగుర్ల మల్లేశం, బెక్కంటి యాదయ్య, అంజిరెడ్డి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు



వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి-చెర్లపల్లిలో పంచాంగశ్రవణం



చేగుంటలో పంచాంగ శ్రవణం చేస్తున్న వెంకటేశ్వర శర్మ



వెల్మకన్నలో బండ్ల ఊరేగింపు



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్ హనుమాన్ ఆలయంలో..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉగాది పర్వదినం వేడుకలు జరుపుకొన్నారు. పండుగను పురస్కరించుకొని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, పంచాగ శ్రవణం ఏర్పాటు చేశారు. అర్చకులు, వేద పండితులు పంచాంగ పఠనం చేయగా, గ్రామస్తులు విన్నారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ వేకువ జామునే లేచి ఇంటికి తోరణాలు అలంకరించారు. తీపి, చేదు, పులుపు, వగరు, కారం, ఉప్పు వంటి షడ్రుచుల కలయికతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసుకొని సేవించారు. ఒకరికొకరు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): గౌతపూర్‌లో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న అర్చకుడు



శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో..



కౌడిపల్లి(నర్సాపూర్): ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లిలో పంచాంగ శ్రావణం



పెద్దశంకరంపేట(మెదక్): కమలాపూర్‌లో పంచాంగ శ్రవణం



రామాయంపేట మున్సిపాలిటీలో పచ్చడి వితరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బొడ్మట్‌పల్లిలో పచ్చడి పంపిణీ



టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లి బీరప్ప ఆలయంలో ..



కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేట ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని వినిపిస్తున్న పురోహితుడు



నిజాంపేట(మెదక్): చల్మెడలో..



తూప్రాన్‌లో ..



శివ్వంపేటలో..

హెచ్ఐవీ నివారణపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికిలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శనివారం రాత్రి స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శృతి కళాబృందం సభ్యులు కళాజాత ప్రదర్శనతో ద్వారా హెచ్ఐవీ ఎయిడ్స్ రాకుండా ఎలాంటి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఐవీ రోగులకు ప్రభుత్వం ఏఆర్‌టీ మందులు ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కోప్ సంస్థ లింక్‌వర్కర్ అనూష, కళాకారులు శేఖర్‌చారి, బాబు, అంజనేయులు, శంకర్, నరేందర్, రాజు, శివానందగౌడ్, ఆశవర్కర్లు బాలమణి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ తారకేశ్వరి గ్రామస్తులు పాల్గొన్నారు.



నివారణపై కళాకారుల కళాజాత ప్రదర్శన

హాస్టల్ వద్ద తల్లిదండ్రుల పడిగాపులు



హాస్టల్ గేటు వద్ద పడిగాపులు పడుతున్న తల్లిదండ్రులు

శివ్వంపేట(నర్సాపూర్): పండుగ వేళ హాస్టల్‌లో ఉన్న తమ పిల్లలకు పిండి వంటలు ఇచ్చేందుకు వచ్చిన తల్లిదండ్రులు పడిగాపులు పడ్డారు. మండల పరిధిలోని గూడూర్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌లో చదువుకుంటున్న వారి పిల్లల కోసం ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం తల్లిదండ్రులు పచ్చడి, బచ్చాలు తీసుకొని హాస్టల్ వద్దకు వచ్చారు. లోనికి వెళ్లేందుకు సిబ్బంది అనుమతి ఇవ్వకపోవడంతో ఎండలో పడిగాపులు పట్టారు. పండగ వేళ హాస్టల్‌లో ఉంటున్న పిల్లలను కల్వనివ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. పలువురు పడిగాపులు కాసిన పిల్లలను చూసేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. గేటుకు తాళం వేసి ఉండడంతో పలువురు బైక్ పైకి ఎక్కి ప్రహరీ నుంచి పచ్చడి, బచ్చాలను పిల్లలకు అందజేశారు. ఈ విషయం గురించి హాస్టల్ ప్రిన్సిపాల్ మంజులను వివరణ కోరగా.. ప్రతీ నెల మూడో శనివారం మాత్రమే విద్యార్థినులను తల్లిదండ్రులు హాస్టల్‌లో కలుసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో అనుమతి లేదన్నారు. అయినప్పటికీ తల్లిదండ్రులు తెచ్చిన పిండి వంటలను విద్యార్థినులకు అందేలా చేశామన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తూప్రాన్: ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని భారత్ పెంట్రోల్ బంకు సమీపంలో లారీ యాజమానులు, డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఎస్‌ఐ శివానందం ప్రారంభించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవ గుణం కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రేపల్లే రాజుతో పాటు కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శివానందం

ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు



పెద్దశంకరంపేటలో దుర్గమ్మ ఆలయం వద్ద ఎడ్లబండ్ల ఊరేగింపు



చేగుంట(తూప్రాన్): కర్నాల్‌పల్లిలో బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని సూరంపల్లిలో సూరమ్మ ఆలయ ఉత్సవాల్లో ఆదివారం బండ్ల ఊరేగించారు. వేడుకలో భాగంగా రకరకాలుగా బండ్లను తయారు చేసి అమ్మవారి చుట్టూ ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉగాదిని పురస్కరించుకొని ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను ఊరేగించారు. యువకుల నృత్యాలు, డప్పుచప్పుల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. దుర్గమ్మ ఆలయం, కొండల రాయుడి గుడి చుట్టూ బండ్లను ఊరేగించారు. ప్రత్యేకంగా పొట్టేల్ బండ్ల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బర్మాస్వామి ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో కొలువైన బర్మాస్వామి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా ఉగాది పండుగ రోజున జాతర నిర్వహించడం ఆనావాయితీ. అందులో భాగంగా బర్మాస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసనిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవాన్ని లాగి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివకుమార్, వైస్ చైర్మన్ స్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ వివిధ పార్టీల నాయకులు హరికృష్ణ, మహేశ్‌గుప్తా, రమణగౌడ్, మన్సూర్, చంద్రగౌడ్, పెద్దపులి రవి, శ్రీధర్‌గౌడ్, బండారి గంగాధర్, రమేశ్‌గౌడ్, అశోక్, మోహన్‌గౌడ్, స్వామి పాలొన్నారు.



టేక్మాల్(మెదక్): బండ్ల ఊరేగింపులో భక్తులు

కర్నాల్‌పల్లిలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో ఉగాది సందర్భంగా గ్రామ దేవతలకు బండ్ల ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువతులు కలశాలల్లో నీటిని తీసుకెళ్లి గ్రామ దేవతలకు అభిషేకం నిర్వహించారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫైజాబాద్‌లో ఎడ్లబండ్ల ఊరేగింపు



శివ్వంపేట(నర్సాపూర్): రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు, భక్తులు

ప్రమాదాల నివారణకు చర్యలు

- హెల్మెట్ లేకపోతే తహసీల్దార్ కార్యాలయంలోకి నో ఎంట్రీ
- కార్యాలయం ఆవరణలో ప్లాస్టిక్ నిషేధం

అల్లాదుర్గం(మెదక్): హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీస్ శాఖ అవగాహన కల్పిస్తూ జరిమానాలు వేస్తున్న వాహనదారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారు కచ్చితంగా హెల్మెట్ ఉండాలని, హెల్మెట్ లేని వాహనదారులకు కార్యాలయంలోకి అనుమతి లేదని, కార్యాలయం ఆవరణలో ఎలాంటి ప్లాస్టిక్ వాడొద్దని, ప్లాస్టిక్ వాడే వారికి కార్యాలయంలోని అనుమతించమని అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బోర్డులు పెట్టి ప్రచారం చేపట్టారు. అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం 161 జాతీయ రహదారి పక్కనే ఉంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పలు పనులపై కార్యాలయానికి వస్తుంటారు. కొందరు ద్విచక్ర వాహనాలపై వస్తున్న హెల్మెట్ పెట్టుకోవడం లేదు. రహదారిపై ఎంతో మంది ప్రమాదాలకు గురై హెల్మెట్ లేక ప్రాణాలు కొల్పోయారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ ప్రమాదాలు స్వయంగా చూసిన తహసీల్దార్ మల్లయ్య తన కార్యాలయానికి ద్విచక్ర వాహనంపై వచ్చే వారు హెల్మెట్‌తో రావాలని, హెల్మెట్ లేకుంటే కార్యాలయంలోకి అనుమతించమని, వారికి ఎలాంటి పనులు చేయకుండా పంపిస్తున్నారు. కార్యాలయం ఆవరణలో ప్లాస్టిక్ వాడితే కార్యాలయంలోకి రానివ్వమని, నో ఎంట్రీ బోర్డులు పెట్టారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యవరణానికి ముప్పు చేకురుతుంది. ప్లాస్టిక్ నిషేధంతో పర్యవరణ పరిరక్షణకు ప్రజల సహకారం కోసమే రెవెన్యూ అధికారులు కృషి చేస్తున్నారు.




అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం వద్ద నో హెల్మెట్, నో ఎంట్రీ బోర్డు



అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్లాస్టిక్ నిషేధం బోర్డు

ప్రజల్లో చైతన్యం తేవడానికే..



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించక పోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కొల్పోతున్నారు. హెల్మెట్ పెట్టుకొని వాహనం నడిపేలా చైతన్యం కల్పించేందుకు, తాము కార్యాలయానికి వచ్చే వారు హెల్మెట్ లేకుంటే నో ఎంట్రి బోర్డు పెట్టాం. ఈ నిర్ణయంతో సగం మంది హెల్మెట్‌తో ప్రయాణిస్తే వారికి కుటుంబాలకు మేలు చేసిన వాళ్లమవుతాం. ప్లాస్టిక్ వాడకంతో పర్యవరణానికి ముప్పు చేకురుతుందని, పర్యవరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను కార్యాలయం ఆవరణలో నిషేధించాం.

– మల్లయ్య , తహసీల్దార్

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబరీష్

పెద్దశంకరంపేట(మెదక్): భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతీ హిందువు కాపాడుకోవాలని మెదక్ విభాగ్ సహ సంపర్క ప్రముఖ్ అంబరీష్ అన్నారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేశవరావు బలిరాంపంత్ హేడ్గేవార్ జయంతిని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1925లో ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించామన్నారు. గ్రామాల వారీగా ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.